## క్లుప్తంగా

### రెడ్డెమ్మతల్లి ఆలయం కిటకిట



సంతానం కోసం అమ్మవారి ఎదుట వరపడిన మహిళలు

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లెలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. సంతానాన్ని ప్రసాదించే చల్లని తల్లి అయిన అమ్మవారి ఆలయానికి వేకువ జాము నుంచే భక్తులు పెద్ద ఎత్తున చేరుకొన్నారు. ఆలయ పరిసరాల్లోని దిగువ తొట్టివారిపల్లెలో పంపిణీ చేసే ఆకు పసరు సేవించి అమ్మవారి కోనేట్లో మునిగిన మహిళలు తడిబట్టలతోనే అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరె సారెలతో మొక్కుబడులు చెల్లించుకున్నారు. పలువురు ఆలయంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. హిందువులతోపాటు ముస్లీం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి దర్శించుకోవడం గమనార్హం.

### వృద్ధులు, వికలాంగులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లతో ఆశ్రమంలో ఉన్న పిల్లలు, వికలాంగులు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని తుమ్మరకుంటకు చెందిన యంగ్ ఇండియా ఫౌండేషన్ సభ్యులు ఇప్పటికే పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం కర్నాటక రాష్ట్రం హొస్‌కోట సమీపంలో ఉన్న విద్యారణ్య ఆశ్రమంలోని 280 మంది వృద్ధులు, వికలాంగులు, పిల్లలకు దుప్పట్లు, టవళ్లు ఫౌండేషన్ అధ్యక్షుడు రాజశేఖర్ పంపిణీ చేశారు.

### ఎన్జీవో సంఘ సమస్యలు పరిష్కరిస్తా



నిసార్ అహ్మద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎన్జీవో సంఘ నాయకులు

మదనపల్లె సిటీ : ఎన్జీవో సంఘం సమస్యలు పరిష్కరిస్తానని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయరకర్త నిస్సార్ అహ్మద్ అన్నారు. స్థానిక బెంగుళూరు బస్టాండు వద్ద ఆదివారం జరిగిన ఎన్జీవో సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్జీవోలు వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. తాను పంచాయతీ రాజ్‌శాఖలోడీఈగా పనిచేసి పదవీ విరమణ చేశానని, అందుకే ఎన్జీవో సంఘంతో పరిచయాలు ఉన్నాయన్నారు. ఈ. కార్యక్రమంలో ఎన్జీవో సంఘం అధ్యక్షుడు నరసింహారెడ్డి, కార్యదర్శి ప్రసాద్‌నాయక్, బిటి నరసింహులు, క్రిష్టప్ప సభ్యులు పాల్గొన్నారు.

### బోర్డుసరే.. ఊరిపేరేది?



బత్తినగారిపల్లె బోర్డు వద్ద చెదలు పట్టి తీగెలు అల్లుకుపోయిన దృశ్యం

గుర్రంకొండ : బోర్డు ఏర్పాటు చేశారు సరే.. అందులో ఊరు పేరు ఎక్కడా కనిపించడం లేదంటూ ప్రయాణికులు విమర్శిస్తున్నారు. మండలంలోని టి.పసలవాండ్లపల్లె పంచాయతీలో బత్తినగారిపల్లె ఉంది. ఎన్‌హెచ్340 రహదారిపై కేశాపురం నుంచి కలిచెర్లకు వెళ్లే మార్గమధ్యంలో ఈ గ్రామం వస్తుంది. ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రయాణీకులు ఈ గ్రామానికి వెళ్లే మార్గాన్ని సూచిస్తూ రోడ్డు పక్కనే బోర్డు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం సదరు బోర్డుకు చెదలు పట్టి తీగెలు అల్లుకుపోయాయి. అధికారులు స్పందించి బోర్డు సరిచేయాలని వారు కోరుతున్నారు.

### దరఖాస్తుల స్వీకరణ

పెద్దమండ్యం : స్థానిక మోడల్ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశాలకు అర్హత గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ రామాంజులునాయక్ తెలిపారు. ఈ నెల 31 లోగాదరఖాస్తు చేసుకొనేందుకు విద్యార్థులకు ప్రభుత్వం గడువు విధించినట్లు చెప్పారు. ఏప్రిల్ 21న పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారాదరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

### నీటి సమస్య తలెత్తకుండా చర్యలు

పీలేరు : పీలేరు గ్రామ పంచాయతీ పరిధిలో వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ జీనత్ షఫీ తెలిపారు. ఆదివారం దిన్‌చెరువు వద్ద మోటారు, పైపులైన్లు అమర్చిప్రారంభించారు.

# పల్స్ పోలియో విజయవంతం



గుర్రంకొండలో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న డీఎంఅండ్ హెచ్‌వో కొండయ్య



వాల్మీకిపురంలో పల్స్ పోలియో చుక్కలు వేస్తున్న రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్

మదనపల్లె సిటీ : మదనపల్లెలో ఆదివారం జరిగిన పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతమైంది. డివిజన్ పరిధిలో 87,139 మందికి పల్స్‌పోలియో చుక్కలు వేయల్సి వుండగా 86,276 మందికి పల్స్ పోలియో చుక్కలు వేసినట్లు మదనపల్లె డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ లక్ష్మి తెలిపారు. ఉర్దూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కలు వేశారు. ఇర్ఫాన్‌ఖాన్ పాల్గొన్నారు. స్థానిక జిల్లా ఆస్పత్రిలో మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజరెడ్డి చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కలు వేశారు. స్థానిక బర్మావీధిలోని రామారావు మున్సిపల్ పాఠశాలలో మదనపల్లె ఆర్డీవో హరిప్రసాద్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ లక్ష్మిలు చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో డాక్టర్ కీర్తిప్రియ, వార్డు కౌన్సిలర్ పాల్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె : మండలంలో 99.8 శాతం పల్స్ పోలియో విజయవంతమైనట్లు కోసువారిపల్లె పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనుపమ తెలిపారు. 4718 మందికి చుక్కలు వేశారు.

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్ట, జిల్లేళ్ళమంద, గ్యారంపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 98 శాతం మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు డాక్టర్ రేష్మ, డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ పావనగౌరీ తెలిపారు. గర్నిమిట్టలో జెడ్పీటీసీ గజ్జెల శృతి పోలియో చుక్కలు వేశారు.

కలికిరి : మండలంలో 99 శాతం మంది చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేసినట్లు మండల వైద్యాధికారి చిన్నరెడ్డెప్ప తెలిపారు. 5753 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశామన్నారు. జిల్లా ఆరోగ్యశ్రీ సమన్వయకర్త డాక్టర్ లోకవర్ధన్ తనిఖీ చేశారు. కలికిరిలో జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, గుండ్లూరులో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్‌కుమార్‌రెడ్డి, గుట్టపాళెంలో సర్పంచ్ వెంకటరెడ్డి పోలియో కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమాల్లో వైద్యాధికారులు కావ్యగంధ, సిప్రాన్, హెచ్‌ఈ హేమలత, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

వాల్మీకిపురం : పోలియో రహిత సమాజం కోసం పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్లలోపు చిన్నారులందరికీ రెండు పోలియో చుక్కలు వేయించాలని నగిరిమడుగు, చింతపర్తి పిహెచ్‌సి వైద్యులు కీర్తి, శ్రీవిద్య అన్నారు. ఆదివారం మండల వ్యాప్తంగా పల్స్ పోలియో చుక్కలను వేశారు. నగిరిమడుగు పిహెచ్‌సి పరిధిలో 96శాతం, చింతపర్తి పిహెచ్‌సి పరిధిలో 95శాతం చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు చౌదరి నయీమ్, మొహమ్మద్ వసీం, వైద్య సిబ్బంది ఇందిరారాణి, సుధాకర్, శారద, తదితరులు పాల్గొన్నారు.

పీలేరు : మండలంలోని రేగళ్లు పీహెచ్‌సీ పరిధిలో 20 కేంద్రాల ద్వారా 4287 మందికి, తలపుల పీహెచ్‌సీ పరిధిలో 22 కేంద్రాలు 3485 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయడం లక్ష్యం కాగా 98 శాతం మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు డాక్టర్ రమేష్‌రెడ్డి, డాక్టర్ కార్తీక్‌కుమార్ తెలిపారు.

రామసముద్రం : మండల కేంద్రంలోని పీహెచ్‌సీ, చెంబకూరు పీహెచ్‌సీ పరిధిలోని పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు డాక్టర్ లీలా, నూరుల్లా, ప్రత్యూషలు వేశారు. జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ రమణారెడ్డి పాల్గొన్నారు. ఇలాంటి కార్యక్రమంలో తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, నిర్లక్ష్యం వహించరాదన్నారు. పోలియో చుక్కలు వేసే కార్యక్రమంలో ఎంపీపీ కుసుమకుమారి, కేశవరెడ్డి, బిసి నాయకులు గెవన్న, కన్వీనర్ నందరెడ్డి, సుబ్బారెడ్డి, రాధరెడ్డి, రెడ్డెప్ప, దొడ్డిపల్లి ఆనంద, సర్దార్‌బాషా, ఉపసర్పంచ్ దొరబాబు, హరి, సర్పంచ్‌లు ఉదయ్‌శంకర్‌రెడ్డి, ఆదినారాయణ, వైద్య సిబ్బంది ఉమాదేవి, భాస్కర్, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశవర్కర్లు, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గుర్రంకొండ : పోలియో రహిత సమాజమే ప్రభుత్వ ధ్యేయమని డీఎంఅండ్‌హెచ్‌వో కొండయ్య అన్నారు. ఆదివారం మండలకేంద్రమైన గుర్రంకొండలోని పలుచోట్ల ఏర్పాటు చేసిన పోలియోచుక్కల కేంద్రాలను తనిఖీ చేశారు. స్థానిక ప్రభుత్వాస్పత్రికి చేరుకొని వివరాలు పరిశీలించారు.

పెద్దమండ్యం : మండలంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైనట్లు సిహెచ్‌వో క్రిష్టయ్య తెలిపారు. మండలంలో 4201 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు చెప్పారు.

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కందుకూరు, పీటీఎం పీహెచ్‌సీ పరిధుల్లోని అన్ని గ్రామాల్లో ఆదివారం జరిగిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది.

కలకడ : మండలంలో జరుగుతున్న పల్స్‌పోలియో కార్యక్రమంలో పోలియో చుక్కలు వందశాతం పూర్తి చేయాలని జిల్లా వైద్యాధ్దికారి డాక్టర్ కొండయ్య, ఎంపీపీ శ్రీదేవి, కోన సర్పంచ్ జల్లారాజగోపాల్‌రెడ్డి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు కోరారు. ఆదివారం జరిగిన పల్స్‌పోలియో కార్యక్రమంలో వారుపాల్గొని ప్రసంగించారు. 98.6శాతం పూర్తి చేసినట్లు వైద్యాధ్దికారులు మల్లికార్జున, కిషోర్‌కుమార్ రెడ్డి లు తెలిపారు.

### 8 నుంచి శివరాత్రి ఉత్సవాలు

పెద్దతిప్పసముద్రం : మండల కేంద్రంలోని పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 8 నుంచి మహా శివరాత్రి ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు సనగరం పట్టాభిరామయ్య తెలిపారు. 8న వివిధ పూజలు, అభిషేకాలు, 9న శివ పార్వతుల కళ్యాణోత్సవం, 10న రథోత్సవం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి ఉత్సవాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

### వైఎస్సార్‌సీపీ సర్పంచి వితరణ

పెద్దతిప్పసముద్రం : మండలంలోని పోతుపేటలో నూతనంగా రామాలయం పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బూర్లపల్లి సర్పంచ్ బుచ్చిగారి సుబ్బిరెడ్డి ఆలయ నిర్మాణం కోసం తన వంతు సాయంగా 50 బస్తాల సిమెంటును అందజేసి దాతృత్వం చాటుకున్నారు.

### విశ్రాంత ఉద్యోగులకు కంటి పరీక్షలు

కలికిరి : ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక షాదీమహల్‌లో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటి వైద్యనిపుణులు హేమంత్ రెడ్డి 50 మంది విశ్రాంత ఉద్యోగులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి, 10 మందిని శస్త్ర చికిత్స కోసం తిరుపతి సురేంద్ర కంటి ఆసుపత్రికి సిఫారసు చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర రెడ్డి, మండల శాఖ గౌరవాధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్, సభ్యులు సత్యనారాయణరావు, మస్తాన్‌ఖాన్,సుబ్బరాజుశెట్టి, కాంతమ్మ, సరోజమ్మ పాల్గొన్నారు.

## చరిత్రాత్మకం... ఇళ్ల పట్టాల పంపిణీ

- జగనన్న పాలనలో ప్రతి ఇంటికీ మేలు
- ప్రతి పక్షాలకు ఓటు అడిగే హక్కు లేదు
- ఇంటి పత్రాలు అందజేసిన నిసార్‌అహ్మద్, నరేష్‌కుమార్‌రెడ్డి



లబ్ధిదారులకు ఇళ్లపట్టాలను పంపిణీ చేస్తున్న సమన్వయకర్త నిసార్‌అహ్మద్

మదనపల్లె : ఏ ఒక్క పేద కుటుంబం సొంతిల్లు లేకుండా ఉండకూడదనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాల్లో పేదలందరికీ ఇళ్లస్థలాల పట్టాలు పంపిణీ చేయడం చరిత్రాత్మకమని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకంలో భాగంగా మదనపల్లె మండలం, మున్సిపాలిటీలోని 16,148 మందికి ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలను ఆదివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్ పర్సన్ మనూజారెడ్డి, ఏపీఎండీసీ చైర్ పర్సన్ షమీం అస్లాం, జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా చలపతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నిసార్‌అహ్మద్ మాట్లాడుతూ.. జగనన్న 58 నెలలు పేదలు, బడుగు, బలహీనవర్గాల మంచి కోసమే పనిచేశారన్నారు. నవరత్నాల పథకాల్లో 99 శాతం హామీలను పూర్తిచేసి, ప్రజలకు ఇచ్చిన మాట నిలుపుకొన్నారన్నారు. పేదలకు ఇళ్ల పట్టాలు రాకుండా కోర్టుకువెళ్లి అడ్డుకోవడం ప్రతిపక్షాలకే చెల్లిందన్నారు. తన పాలనలో ప్రతి ఇంటికీ మేలు జరిగిందన్న నమ్మకం ఉంటేనే తనకు ఓటు వేయండని అడుగుతున్న ఏకైక నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ పాలన కలకాలం కొనసాగాలంటే.. రానున్న ఎన్నికల్లో మళ్లీ జగనన్నను సీఎంగా గెలిపించుకుందామన్నారు. మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు మాయమాటలు చెప్పి మోసగించే నైజం చంద్రబాబుది అయితే.. ఇచ్చిన మాట కోసం ఇబ్బందులెన్ని ఎదురైనా తట్టుకుని నిలుపుకునే గొప్ప గుణం జగనన్నది అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, కమిషనర్ ప్రమీల, సర్వేయర్ సుబ్రహ్మణ్యం, మున్సిపల్ కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు జబ్బల సుబ్రహ్మణ్యం, ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, గుండ్లూరు రఫీ, పసుపురవి, ఎల్‌ఐసీ. సుధాకర్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కుటుంబానికి పథకాల లబ్ధి

పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తున్న పీలేరు ఎమ్మెల్యే చింతల,రామచంద్రారెడ్డి, తదితరులు

కలకడ : ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల లబ్ధి, చేసిన అభివృద్ధి, తెలియజేసి ఓటును వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా మలుచుకోవాల్సిన బాధ్యత ఉందని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. కలకడ వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మండలస్థాయి వైఎస్సా ర్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తల ఆదివారం సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి నేరుగా రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ లబ్ధి చేకూరిందని గుర్తు చేశారు. నిజాయితీగా ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అడిగే బాధ్యత మనపై ఉందని, ప్రతి కార్యకర్త అందుకు కృషి చేయాలని కోరారు. ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసే విధంగా అభ్యర్థించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, కలికిరి మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ రవికుమార్‌రెడ్డి, ఎంపీపీ శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు హారిక, సింగల్ విండో అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, సర్పంచ్ శాంతమ్మ, రామచంద్ర, నల్లమ్మ, డాక్టర్ పురుషోత్తంనాయుడు, జివికిషోర్, షావత్‌అల్లీఖాన్, సుల్తానీబాష, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

## సోమేశ్వరస్వామి బ్రహోత్సవాల పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఈఓ, అర్చకులు

మదనపల్లె సిటీ : మహాశివరాత్రి పురస్కరించుకుని మదనపల్లె పట్టణం దేవళంవీధిలోని సోమేశ్వర స్వామి బ్రహోత్సవాల పోస్టర్లను ఆదివారం ఆలయం వద్ద ఆవిష్కరించారు. దేవాదాయశాఖ ఈఓ రమణ, ఆలయ ప్రధాన అర్చకులు ఆలూరు ఫణికుమార్‌శర్మ మాట్లాడుతూ 6న బ్రహోత్సవాలు గణపతి పూజతో ప్రారంభమవుతాయన్నారు. 7న ధ్వజారోహణం, మండప పూజ, సాయంత్రం నంది వాహన సేవ, గ్రామోత్సవం జరుగుతాయన్నారు. 8న మహాశివరాత్రి సందర్భంగా రాత్రి 12 గంటల నుంచి అభిషేక పూజలు, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, ఉదయం నుంచి భక్తులకు స్వామి సర్వ దర్శనం కల్పిస్తామన్నారు. రాత్రి గిరిజా కళ్యాణం కన్నుల పండువగా జరుగుతుందన్నారు. 9న రుద్రాభిషేకం, సాయంత్రం శ్రీవారి శయనోత్సవం, 10న సుప్రభాత సేవతో ఉత్సవాల ముగింపు ఉంటుందన్నారు. భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

## పోరాటాలతోనే వాల్మీకులకు న్యాయం

రౌండ్ టేబుల్ సమావేశంలో వాల్మీకి సంఘ నాయకులు



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వాల్మీకి సంఘం నాయకులు

మదనపల్లె : పోరాటాలు చేసి ప్రధాన రాజకీయ పార్టీలకు వాల్మీకుల ఐక్యత, బలం, తెలియజేస్తేనే వాల్మీకులకు న్యాయం జరుగుతుందని జయహో వాల్మీకి సంఘం ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపకులు పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. మదనపల్లి పట్టణంలోని శ్రీరామ కళ్యాణ మండపంలో ఆదివారం జయహో వాల్మీకి రాష్ట్ర స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి వివిధ జిల్లాల నుంచి వివిధ వాల్మీకి సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా.. పులి శ్రీనివాసులు మాట్లాడుతూ వాల్మీకులు అన్ని రంగాలలోనూ వెనుకబడి ఉన్నారన్నారు. పోరాటంతోనే వాల్మీకులకు ఎస్టీ హోదా సాధించుకుందామని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికలలో వాల్మీకులు ఇండిపెండెంట్ అభ్యర్థులుగా నిలబడి ప్రధాన రాజకీయ పార్టీలకు మన సత్తా చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సద్దాల జయసింహా, వలసల మంజునాథ్, కుప్పం సురేష్‌బాబు, పుంగనూరు సుకుమార్ బాబు, గుత్తి వీరభద్ర, కోలార్ వెంకట్, శేషాద్రి, వీఆర్‌ఎస్ ఆంజనేయులు, లక్ష్మి నారాయణ, ఎంవీఆర్‌ఎస్ పులికొండన్న, తదితరులు పాల్గొన్నారు.

## జగనన్నతోనే రాష్ట్రం అభివృద్ధి

గడప, గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి



బురకాయలకోటలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి

ములకలచెరువు : సీఎం జగనన్నతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. గడప, గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని సెంట్రల్ స్కూల్, బురకాయలకోట పంచాయతీల్లో ఆదివారం ఆయన పర్యటించారు. ఎమ్మెల్యే ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయాలకు అతీతంగా అన్ని రకాల సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కిందన్నారు. గత టీడీపీ పాలనలో అర్హులకు సంక్షేమ పథకాలు మంజూరు కావాలంటే జన్మభూమి కమిటీల సిఫారసుతో పాటు వారికి దక్షిణ సమర్పించుకోవాల్సిందే అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గం అన్ని విధాలా అభివృద్ధి చెందిందని ధీమా వ్యక్తం చేసారు. పలు చోట్ల ప్రభుత్వ బోర్లలో జలాలు అడుగంటడంతో తాగునీటి సమస్య నెలకొందని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు రావడంతో తక్షణం నీటి ఎద్దడి నివారణ చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. మండలానికి 10 చొప్పున బోర్ల మంజూరుకు ప్రతిపాదనలు పంపామని అవసరమైన చోట వాటిని డ్రిల్లింగ్ చేస్తామన్నారు. పలు చోట్ల సిమెంటు రోడ్లు, మురికి కాలువలు మంజూరు చేయాలని కోరారు. రాబోవు ఎన్నికల్లో మళ్లీ జగనన్న పాలన వచ్చేందుకు ప్రజలంతా ఆశీర్వదించాలని ఆయన ప్రజలను కోరారు. ఆయన వెంట ఎంపీపీ సాయిలీల, జెడ్పీటీసీ మోహన్‌రెడ్డి, సర్పంచ్‌లు విజయమ్మ, వెంకట్రమణారెడ్డి, ఎంపీటీసీ లక్ష్మీదేవి, ఆర్‌బీకే చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, నాయకులు ఫక్రుద్దీన్, మంజునాథ్, శ్రీనివాసులు రెడ్డి, మోహన్‌రెడ్డి, విజయకుమార్‌రాజు, రాజశేఖర్‌తో పాటు అధికారులు పాల్గొన్నారు.

### నాణ్యమైన విద్యుత్ ఇవ్వడమే లక్ష్యం

పీలేరురూరల్ : రైతులకు నాణ్యమైన విద్యుత్ ఇవ్వడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ మునిచందర్ అన్నారు. విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ పీలేరు, కేవీపల్లె మండలాల్లో 170 మంది రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని, వారికి సత్వరమే 132 ట్రాన్స్‌ఫార్మర్లు పంపిణీకి సిద్ధం చేసినట్లు తెలిపారు.

### లోకాయుక్తకు ఘనంగా వీడ్కోలు

పెద్దతిప్పసముద్రం : రాష్ట్ర లోకాయుక్త, ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టీస్ పీ.లక్ష్మణరెడ్డి టి.సదుం పంచాయతీ చెన్నరాయునిపల్లికి కుటుంబ సభ్యులతో విచ్చేసారు. మూడు రోజుల తర్వాత పలువురు ఆయనకు ఘనంగా డీడ్కోలు పలికారు. అనంతరం లోకాయుక్త పోలీస్ ఎస్కార్ట్‌తో రోడ్డు మార్గంలో కర్నూలుకు తిరుగు ప్రయాణమయ్యారు.

### సారా విక్రేత అరెస్ట్

మదనపల్లె : అక్రమంగా సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ ఎన్. శేఖర్ తెలిపారు. తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలోని బసినికొండలో సారా విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేశామన్నారు. స్థానికుడైన నరసింహులు కుమారుడు జి సురేష్ బాబు (45) సారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితుని వద్ద నుంచి 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

## సంక్షేమ ఫలాలు వివరించి ఓట్లు అడుగుదాం

పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, జి.వి.శ్రీనాథరెడ్డి



వగళ్లలో పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి

కేవీపల్లె : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజలకు వివరించి వైఎస్సార్ సీపీని ఆశీర్వదించేలా ఓట్లు అడగాలని పీలేరు, కేవీపల్లె మండలాల పార్టీ ఇన్‌చార్జి పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి సూచించారు. మండలంలోని తిమ్మాపురం, వగళ్ల, గోరంట్లపల్లె, సొరకాయలపేటలో పార్టీ కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్ని క్లిష్ట పరిస్థితులు ఎదురైనా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో వెనుకంజ వేయలేదన్నారు. ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించారని తెలిపారు. మరోసారి జగనన్న ముఖ్యమంత్రిగా కావల్సిన ఆవశ్యకత ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కార్యకర్తలకు ఉందన్నారు. రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డికి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి గతంలో కంటే ఎక్కువ మెజారిటీ ఇవ్వడానికి కార్యకర్తలు నడుం బిగించాలన్నారు. చిన్న అభిప్రాయబేధాలు పక్కనపెట్టి పార్టీకోసం పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి, జెడ్పీటీసీ గజ్జెల శృతి, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ కారపాకుల భాస్కర్ నాయుడు, ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రదీప్‌రెడ్డి, నాయకులు పొత్తపు సతీష్‌రెడ్డి, జయరామచంద్రయ్య, వెంకటసిద్దులు, రాస్ మల్లికార్జునరెడ్డి, ఎంపీటీసీ లక్ష్మీదేవి, రఘురామిరెడ్డి, పి. ద్వారకనాథరెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, ఖాదర్‌బాషా, ముద్దుకృష్ణ, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## పది విద్యార్థులకు ప్రణాళిక అవసరం



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

కేవీపల్లె : పది విద్యార్థులు మంచి భవిష్యత్తు ప్రణాళిక రూపొందించుకోవాలని అలూమ్ని అసోసియేషన్ అధ్యక్షులు రవీంద్ర, పూర్వ విద్యార్థి ప్రవీణ్ అన్నారు. ఆదివారం గ్యారంపల్లె ఏపీ గురుకుల పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఇండియన్ అకాడమీ ఆఫ్ పిడియాట్రిక్స్ సారథ్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కెరీర్ గైడెన్స్ బుక్స్, పెన్నులు, ప్యాడ్స్ పంపిణీ చేశారు. అనంతరం స్విమ్స్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కిరీటి, పీలేరు ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ సురేంద్ర విద్యార్థులకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ బ్రహ్మాజి, ఎంపీటీసీ సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కామాక్షి సమేత సిద్ధేశ్వరస్వామికి పూజలు



కలకడలోప్రత్యేక పూజలు అందుకున్న స్వామి, అమ్మవారు

కలకడ : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం ధ్వజా రోహణం నిర్వహించి శివమాల ధారులు, భక్తులు ఉత్సవాల కంకణం ధరించారు. సోమవారం ఉదయం, సాయంత్రం స్వామి పల్లకిలో శ్రీకామాక్షిసమేత సిద్ధేశ్వరస్వామిక్తులకు దర్శనమిస్తారు.

### పదోన్నతులు చేపట్టాలి



మాట్లాడుత్నన్న అపస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజి

పీలేరు : ఉమ్మడి సర్వీసు రూల్స్‌తో పదోన్నతులు చేపట్టాలని అపస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజి అన్నారు. పీలేరులో జిల్లా అధ్యక్షుడు నరసింహులు అధ్యక్షతన డివిజన్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేసిన హైస్కూల్ ప్లస్‌లకు శాశ్వత ప్రాతిపదికన పీజీటీలను నియమించాలన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు రావాల్సిన ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి దివాకర్ మాట్లాడుతూ 117 జీవోను రద్దు చేసి ఉపాధ్యాయుల పని భారం తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో అపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, నాయకులు శివశంకర్, గోవర్ధన్, జనార్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్, ప్రభాకర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లైంట్ ఎ.వెంకట్రమణమ్మ భర్త ఎ.అమరనారాయణ, మదనపల్లె గారి తరుపున యావన్మందికి తెలియజేయడం ఏమనగా!

క్రింది కనిన దావాల షెడ్యూలు దాఖలా ఆస్తి విషయమైన రాజశ్రీ వాయల్పాడు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు నందు O.S.No.253/2023, O.S.No.7/2024, O.S.No.12/2024 అను దావాలు దాఖలు వేసియున్నాము. అందులో Not to Alienate Injunction కొరకు పిటిషన్లు వేసినాము అవి పెండింగులో వున్నవి. అందులో ప్రతివాదులకు నోటీసులు పంపగా వారి తీసుకొని వకీళ్లను నియమించుకొని కేసులు నడుపుచున్నారు.

ముఖ్యంగా తెలియజేయడం ఏమనగా సదరు దావాల షెడ్యూలు ఆస్తి, బాలుం పాలేటి. యం.గుర్రమ్మ మరియు మంజుల గార్ల తల్లితండ్రుల మరియు తమ్ముడు టి.కృష్ణప్ప కొనుగోలు చేసినారు. కృష్ణప్ప అవివాహితుడుగా మరణించినాడు. సదరు ఆస్తిని 09.04.2012న పై కనిన ముగ్గురు A,B,C షెడ్యూళ్లగా బాగపరిష్కారము చేసుకొన్నారు. అందులో సదరు ఎం.గుర్రమ్మ, మంజుల గార్లకు రాబడిన, B,C షెడ్యూలు ఆస్తి 2/3 వంతు బాగము మా క్లైయింట్ ఎ.వెంకట్రమణమ్మ రిజిస్టరు దస్తావేజు నెం.900/2012 తేది.26.04.2012న కొనుగోలు చేసివున్నది. మిగిలిన 1/3 వంతు బాగము ఎ-షెడ్యూల్ బాలుం పాలేటి వద్ద కొని అగ్రిమెంట్ చేసుకొన్నది తేది: 29.12.2016న, కావున దావాల షెడ్యూలు ఆస్తి మొత్తం నా క్లైంట్ ఎ.వెంకట్రమణమ్మకు మాత్రమే సంపూర్ణ హక్కులు కలవు. ఎవ్వరికీ ఎలాంటి హక్కు, భుక్తములు లేవు అని పై కనిన దావాలు చేసివున్నాము. ఆ దావాలు అన్నియు పెండింగ్‌లో వున్నవి. వాయల్పాడు మండలం, చింతలవారిపల్లి గ్రామం నందు సర్వే నెం.4/1, 566/2, 566/3 నందు 2/3 భాగము పై కనిన గుర్రమ్మ, మంజుల గార్ల నుండి నా క్లైంట్ కొని, స్వాధీనం చేసుకొన్నారు. సదరు బి.పాలేటి తిరిగి మోసగించి ప్రతివాదుల పేరుమీద మొత్తం ఆస్తిని కాజేయవలెనని ఉద్దేశ్యంతో రిజిస్టర్ చేసినాడు, సదరు విషయమై O.S.No.253/2023, O.S.No.12/2024, Specific Performance & Declaration of right and title దావాలు వేసియున్నాము. సర్వే నెం.568/1 నందు ఏ 4-11 సెంట్లు పూరా రామనారాయణ రెడ్డి వద్ద నా క్లయింట్ కొన్నది దస్తావేజు నం.917/2012 తేది.25.04.2012.కావున మొత్తం విస్తీర్ణం కొన్నందున నా క్లైంట్ కోర్టు యందు పై కనిన దావాలు వేసివున్నారు. నా క్లైంట్‌కు మాత్రమే సంపూర్ణ హక్కులు కలవు. ప్రతివాదులకు కానీ, వారి వద్ద కొన్న వారికి కానీ ఎటువంటి హక్కులు సంక్రమించవు. కోర్టులో వేసిన ప్రతివాదులలో చెన్నకేశవ అక్క గారి పేరుమీద మరియు ఇతర కుటుంబ సభ్యుల మీద మరియు సదరు ఎం.మంజుల కోడలు ఎం.రెడ్డిరాణి భర్త రాజగోపాల్ మరియు ఇతరుల పేర్లమీద భోగస్ రెవెన్యూ రికార్డులు తయారు చేసుకొని 2012న రిజిస్టర్ అయిన భూమిని తిరిగి విక్రయించాలని ప్రయత్నం చేయుచున్నట్లు సమాచారం, ఎటువంటి అగ్రిమెంట్‌లు కానీ, క్రయ విక్రయాలు చేసిన అవి చట్ట ప్రకారం ఏమాత్రం చెల్లుబాటుకావు. నా క్లైంట్‌కు మాత్రమే సంపూర్ణ హక్కులు కలవు. కావున హక్కులేని వారి వద్ద క్రయ విక్రయములు జరిపి రిజిస్టరు దస్తావేజులు సృష్టించిన వారందరి మీద సివిల్ మరియు క్రిమినల్ చర్యలు చట్టపరంగా తీసుకొనబడునని ఈ ప్రకటన ద్వారా యావన్మందికి తెలియజేయుచున్నాము.

P.RAM PRASAD, M.B.A., B.Ed., LLB., M.KAREEMULLA BEIG, M.A.,B.L.
Advocates, Madanapalle-517325.